## పోలీసులు స్నేహభావంతో మెలగాలి

- అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్




రికార్డులను పరిశీలిస్తున్న శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : పోలీస్ సిబ్బంది ప్రజలతో స్నేహభావంతో మెలగాలని శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లో నమోదైన పాత కేసు వివరాల గురించి ఆరా తీశారు. శాంతి భద్రతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి స్థానిక సీఐ, ఎస్‌ఐలకు పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సంబంధిత రికార్డులను పరిశీలించారు. సిబ్బంది బాగోగుల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ బి. ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ బలరాంనాయక్ తదితరులు ఉన్నారు.

## కూలీల సమస్యలను పరిష్కరించాలి



అడిషనల్ పీడీ చరణ్‌గౌతమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 10: ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని షాద్‌నగర్, చేవెళ్ల క్లస్టర్ అడిషనల్ పీడీ చరణ్‌గౌతమ్‌కు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూ నాయక్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని, 200 రోజుల పని దినాలను కల్పించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా మౌలిక వసతులను కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగం, దీప్లా, రవి, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి




ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆమనగల్లు, ఏప్రిల్ 10 : అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఆమనగల్లు మున్సిపాలిటీలో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ జాతీయ రహదారిపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పిచ్చయ్య, ఆర్‌పీ ఎస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

- తుర్కయాంజాల్ ప్రధాన రోడ్డుపై పెరిగిన వాహనాల రద్దీ
- రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు



తుర్కయాంజాల్ చౌరస్తాలో ఉదయం సమయంలో సాగర్ రహదారిపై రద్దీ

తుర్కయాంజాల్, ఏప్రిల్ 10: రోడ్లపై పాదచారులు ప్రమాదాలకు గురి కాకుండా రద్దీగా ఉండే చౌరస్తాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతారు. తుర్కయాంజాల్ మున్సిపల్ చౌరస్తాలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేండ్ల నుంచి తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో పాదచారులు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురి కావడంతో పాటు పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. తుర్కయాంజాల్ చౌరస్తాలో ఉన్న సాగర్ ప్రధాన రహదారిని నిత్యం వందల సంఖ్యలో ప్రజలు దాటుతారు. సాగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా దవాఖానలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. దీంతో పాదచారులు రోడ్డును దాటి మరోవైపుకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వేగంగా దూసుకొస్తున్న వాహనాలతో పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో తుర్కయాంజాల్ చౌరస్తాలో రోడ్డును దాటడానికి యూటర్న్ ఉండగా చౌరస్తాలో వాహనాలు మలుపు తీసుకునేప్పుడు ప్రమాదాలు జరుగుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు యూటర్న్‌ను మూసివేసి దిమ్మెలను ఏర్పాటు చేశారు. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి కార్యాలయం, దుకాణాలకు వెళ్లే పాదచారులు దిమ్మెలపై నుంచి రోడ్లను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు ఫుల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### నిత్యం ప్రమాదాలు



తుర్కయాంజాల్ చౌరస్తాలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు రోడ్డు దాటే క్రమంలో వేగంగా వస్తున్న వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తుర్కయాంజాల్ చౌరస్తాలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– మేతరి శంకర్, తుర్కయాంజాల్

# రేపు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

- బీఆర్‌ఎస్ శ్రేణులు కదలాలి
- గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి




ఇబ్రహీంపట్నం రూరల్ : బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 10 : బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 12న బొంగ్లూర్ సమీపంలోని ప్రమిద గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అధ్యక్షుడు కృపేశ్ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. ఈనెల 12న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే బీఆర్‌ఎస్ సమావేశానికి మండలంలోని 14 గ్రామాలు, అనుబంధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్‌పార్టీ బాధ్యులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బూడిద రాంరెడ్డి, గణేశ్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, బీఆర్‌ఎస్ మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, హరిప్రసాద్, నర్సింహాతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



మంచాల :విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు చీరాల రమేశ్

**భారీ మెజార్టీతో గెలిపిద్దాం**

మంచాల : బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ నెల 12న నిర్వహించే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ప్రమిద గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ నర్మద, మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు బస్సు పుల్లారెడ్డి, జంబుల కిషన్‌రెడ్డి, చిందం రఘుపతి, రాంరెడ్డి, ఆకారం కృష్ణ, మంకు ఇందిర, సుకన్య, జానీపాషా, నారి యాదయ్య, బద్రినాథ్‌గుప్తా, ఇటికల ప్రకాశ్‌రెడ్డి, రావుల శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సబితారెడ్డి



సబితారెడ్డి

రంగా రెడ్డి, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): ముస్లింలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రంజాన్(ఈదుల్ ఫితర్) శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రంతో 30 రోజుల పాటు కొనసాగించిన కఠోర ఉపవాస దీక్షలు విరమించి, గురువారం పండుగ జరుపుకొంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త బాటలో నడుస్తూ, సమాజంలో పేదల ఆకలి బాధలు తెలుసుకుని, దాన ధర్మాలు చేస్తూ, దయాగుణం, సేవ, శాంతితో ముందుకు వెళ్లడం గొప్ప విషయమని అన్నారు. ఈద్‌ను ముస్లింలు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ఈద్గాలు, మసీదులు ముస్తాబు



కడ్తాల్ : ఈద్గా వద్ద చదును చేయిస్తున్న మైనార్టీ నాయకులు

ఆమనగల్లు : నెల రోజులుగా ఉపవాసాలు ఉన్న ముస్లింలు నేడు మండల వ్యాప్తంగా రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గాలను ముస్తాబు చేశారు. ఆమనగల్లులోని ఈద్గా వద్ద ఆమనగల్లు మండల ఎస్‌ఐ బాల్‌రామ్ నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పాషా, నహీమ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈదుల్ ఫితర్

కడ్తాల్ : పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం నిర్వహించబోయే ఈదుల్ ఫితర్ నమాజ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మసీదు కమిటీ నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో నమాజ్‌ల కోసం ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈద్గా పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు వేసవి కాలం దృష్ట్యా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఈద్గాలో ఉదయం 8.30 నిమిషాలకు నమాజ్ ప్రారంభమవుతుందని మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావిద్ తెలిపారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత




ఎమ్మెల్యేకు జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడ్తాల్, ఏప్రిల్ 10 :మండల కేంద్రంలో కొలువుదీరిన ఈదమ్మతల్లి జాతర ఉత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ నగరంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని బుధవారం ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో గండికోట నర్సింహ, రేపని యాదయ్య, బోసు వెంకటేశ్, ఓర్సు యాదయ్య, డేరంగుల నాగార్జున్, సత్యనారాయణ, వడ్డే రాజు, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఒకరి మృతి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 10: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సలీం(46) పాత ఇనుప సామాన్లను కొనుగోలు, అమ్మకాలు చేస్తూ జీవనం కొనసాగించే వాడు. ఈ క్రమంలో బుధవారం సొంత పని నిమిత్తం పట్టణంలోని భవానీ బార్ ఎదుట నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి జడ్చర్లకు వెళ్తున్న లారీ సలీంను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడు ఖలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నయీం తెలిపారు.

## కూలీలకు వసతులు కల్పించాలి



ఆరుట్లలో కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

మంచాల, ఏప్రిల్ 10 : ఉపాధి హామీ కూలీలకు వసతులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం



కందుకూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కందుకూరు. ఏప్రిల్ 10 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందన్నారు. కాగా వారి హామీల్లో కేవలం మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం తప్ప ఇతర హామీలు అమలుకు నోచుకోలేదని అన్నారు. రూ.500లకే గ్యాస్, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ పథకం, గృహలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత లాంటి పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుందని కానీ ఈ పథకాలు ఎక్కడా కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలలో ఒక్క హామీ మాత్రమే అమలవుతుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో గెలవడానికి మరోమారు కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టి బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయం కోసం తామందరం కష్టపడి పని చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేస్తా మన్నారు. కార్యకర్తలు సమష్టిగా పని చేసి చేవెళ్ల గడ్డపై మరోమారు గులాబీ జెండాను ఎగురవేయాలని కోరారు.

**నేడు సమావేశం ...**

బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురు వారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి పెద్దమ్మ దేవాలయం వద్ద ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు, ఈ సమావేశానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బైక్ దొంగలు అరెస్ట్

కందుకూరు. ఏప్రిల్ 10 : ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ మక్బూల్ జానీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొంగరకలాన్ గ్రామానికి చెందిన తెపర్ల బీమేశ్, కొత్ర యాదయ్యలు 17సంవత్సరాల బాల నేరస్తుడితో కలిసి కందుకూరు, యాచారం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో మోటరు వాహనాలను దొంగిలిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం కందుకూరు మండల కేంద్రంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న వారిపై అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా. కందుకూరు. యాచారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి పల్సర్ బైక్, స్ప్లెండర్‌బైక్‌తో పాటు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

# ధోబీఘాట్ స్థలాన్ని కాపాడాలని వినతి



తహసీల్దార్ మాధవికి వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

బడంగ్‌పేట, ఏప్రిల్10: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న సాకిరేవు స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని నాదర్‌గుల్ రజక సంఘం నాయకుడు బాలు రజక ఆధ్వర్యంలో బాలాపూర్ తహసీల్దార్ మాధవి రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. రజక సంఘానికి గతంలో కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. చాలా మంది ఇప్పటికి ధోబీఘాట్‌గా ఉపయోగించుకుంటున్నారని తెలపారు. సంఘం పేరు మీద ఆ స్థలాన్ని కేటాయించాలన్నారు. కొంత మంది ఆ స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. స్థల పరిశీలన చేయిస్తానని తహసీల్దార్ వారికి చెప్పారు. ఆ స్థలం కబ్జా కాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కుమారుడి జ్ఞాపకార్థం అన్నదానం



అన్నదానం చేస్తున్న తల్లిదండ్రులు రామిడి చంద్రారెడ్డి, ఇంద్ర

కడ్తాల్, ఏప్రిల్ 10 : జిల్లా పరిధిలోని బాలాపూర్ మండలం ఆల్మాస్‌గూడకు చెందిన రామిడి చంద్రారెడ్డి, ఇంద్ర దంపతులు కుమారుడు రామిడి సుధీర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన జయంతి సందర్భంగా మైసిగండి ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు నవకిశోర్‌రెడ్డి, శిరీష దంపతులు, మైసిగండి మాజీ సర్పంచ్ తులసీరాం, హాస్టల్ వార్డెన్ బాల్‌రాజ్, నయీముద్దీన్, శ్రావణ్‌కుమార్, సంతోశ్‌కుమార్, సరిత, భగవతి, రమ్మ, విజయలక్ష్మి, వెంకటేశ్, మంజుల పాల్గొన్నారు

## పెట్రోల్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 10: ఇంటి ముందు పార్క్ చేసిన బైకు నుంచి పెట్రోల్‌ను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన బుధవారం షాద్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. షాద్‌నగర్ పట్టణంలోని నెహ్రూకాలనీలో నివాసం ఉంటున్న ప్రవీణ్‌కుమార్ ఈ నెల 9న రాత్రి తన ఇంటి ముందు బైకును పార్క్ చేశాడు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు బైక్ నుంచి పెట్రోల్ తీసుకెళ్లారు. ఈ విషయమై ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు గణేశ్‌ను పట్టుకోవడంతో పాటు మూడు లీటర్ల పెట్రోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ కేసును డీఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

## అరుణోదయ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డిని కలిసిన అరుణోదయ కాలనీ నూతన కమిటీ సభ్యులు

హయత్‌నగర్, ఏప్రిల్ 10 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి వారికి శాలువా కప్పి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కళ్లెం శంకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుంగ నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.